క్లుప్తంగా

అరబుపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీవల్లి

మునగపాక: ప్రతీ ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవల్లి కోరారు. మండలంలోని అరబుపాలెంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు.ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, సీహెచ్‌వో దేవకాంత. ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్,వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

అచ్యుతాపురం(అనకాపల్లి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ స్కూల్ విద్యార్థులకు మ్యూజికల్ చైర్ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఉద్యోగావకాశాలు దక్కించుకోవాలన్నారు. అచ్యుత స్కూల్ ఉపాధ్యాయురాలు భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై వినతి

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో పూడిమడక మత్స్యకారులు, ఉప్పు కార్మికులు ఉప్పుటేరుపై జీవిస్తున్నారని, అటువంటి ఉప్పుటేరులో వింతపాములు దర్శనమిస్తున్నాయంటూ మాజీ సర్పంచ్, జిల్లా మత్స్యకార విభాగం నాయకుడు చోడపల్లి అప్పారావు సోమవారం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేకుంటే ఇటు మత్స్యకారులు, ఉప్పు కార్మికులు నష్టపోయే ప్రమాదముందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పాములవాకలో గడప గడపకు నేడు

కోటవురట్ల : పాములవాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొని ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

మునగపాక తహసీల్దార్‌గా ప్రకాశరావు

మునగపాక : మునగపాక తహసీల్దార్‌గా పి.ప్రకాశరావు నియమితులయ్యారు. తహసీల్దార్‌ల బదిలీల్లో భాగంగా పరవాడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రకాశరావును మునగపాకకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. మునగపాక తహసీల్దార్‌గా పనిచేసిన బాబ్జీ నాలుగునెలల క్రితం పదోన్నతిపై వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ప్రకాశరావును నియమించారు. త్వరలో ప్రకాశరావు బాధ్యతలు చేపట్టనున్నారు.

అంగన్‌వాడీల్లో హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

నక్కపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న హెల్పర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని సీడీపీవో శ్రీవిద్య తెలిపారు. కోటవురట్ల, అరట్లకోట 1, నీలాద్రిపురం , చినగుమ్ములూరు 2, పెద దొడ్డిగల్లు, ఎస్.రాయవరం 2, వెంకటనగరం, గొడిచర్ల 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీలున్నాయన్నారు. జూలై1వ తేదీనాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ వారికి 18 ఏళ్లు నిండితే చాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 12వ తేదీ లోగా ఐసీడీఎస్ నక్కపల్లి కార్యాలయంలో అందజేయాలన్నారు. స్థానికులై ఉండాలని, వివాహితులయిన సంబంధిత అర్హత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు జతచేసి అందజేయాలన్నారు. రాతపరీక్ష, మౌఖిక పరీక్ష ఆధారంగానే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మునగపాక : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ ఆలీ తెలిపారు. గణపర్తి శారదానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు ఫిర్యాదు అందడంతో మునగపాక పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆలీ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం కావాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి
- యలమంచిలిలో అవగాహన ర్యాలీ



యలమంచిలిలో మొక్కను నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి



మానవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తున్న మెప్మా, మున్సిపల్, శానిటరీ అసిస్టెంట్‌లు

యలమంచిలి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. సోమవారం యలమంచిలిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ. సాయికుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు నాగ త్రినాథ్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు.

యలమంచిలి ఎంపీడీవో ఆఫీస్ వద్ద ప్లాస్టిక్ రీసైక్లింగ్ సెంటర్‌ను ఆమె సందర్శించి అక్కడ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏవిధంగా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ల ద్వారా రీ సైక్లింగ్‌కి పంపిస్తున్నారో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. పర్యావరణంపై అవగాహన కలిగేలా మెప్మా సిబ్బంది వేసిన రంగవల్లికను చూసి అభినందించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పర్యావరణానికి హాని తలపెడితే వారు చట్ట ప్రకారం శిక్షార్హులని అన్నారు. పట్టణంలో డ్రైయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తున్నారని, దానిని విడనాడాలని అన్నారు.

విశాఖపట్నం కాలుష్య నియంత్రణ మండలి అధికారి భాస్కరరావు మాట్లాడుతూ నిత్యం ప్రపంచ వ్యాప్తంగా 4 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, దీనివల్ల కొన్ని లక్షల జీవరాశులు నశిస్తున్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులు వాడాలని, ఆ మేరకు ప్లాస్టిక్ నియంత్రణకు తోడ్పడాలని కోరారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో ప్రజలు వ్యర్థ పదార్థాలతో కూడిన చెత్త, పొడిచెత్త, ప్రమాదకర చెత్త, పనికిరాని వస్తువులను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి యలమంచిలి శ్మశానవాటిక వద్ద మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించారు.

నక్కపల్లి : ప్రాణవాయువుకు మూలాధారం పర్యావరణమని దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని నక్కపల్లి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం నక్కపల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల ప్రత్యేకాధికారి రమామణి, ఎంపీడీవో సీతారామరాజు, సీతంపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ నాగ అప్పలరాజు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, చినతీనార్లలో సర్పంచ్ మునలయ్య, నక్కపల్లి సంపద తయారీ కేంద్రం వద్ద ఉప సర్పంచ్ వీసం రాజు, కార్యదర్శి రాజశేఖర్ గొడిచర్లలో సర్పంచ్ అల్లు పార్వతి రమణ, ఎంపీటీసీ గోవిందు, ముకుందరాజుపేటలో సర్పంచ్ వియ్యపు శ్రీను తదితరులు మొక్కలు నాటారు. ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో మొక్కలు నాటుతున్న సీఐ అప్పలరాజు

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని చినగుమ్ములూరు గ్రామంలో జెడ్పీటీసీ పలు మొక్కలను నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహకారంతో అందిస్తున్న మొక్కలు ప్రతి ఒక్కరూ నాటి వాటిని బాధ్యతాయుతంగా పెంచాలని సూచించారు. పి.ధర్మవరం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంల మొక్కలు నాటారు. సర్వసిద్ధి , పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమం చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, అంగన్‌వాడీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలో శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు భజన మండలి కన్వీనర్లు ఎల్.వి.శర, రమణరాజు, శివరామకృష్ణ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న భజన మండలి బృందం



చినగుమ్ములూరులో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ కాకర దేవి

పాయకరావుపేట : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరి పైన వుందని సీఐ పి.అప్పలరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఆయన పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ వారి ఇళ్లు, కార్యాలయాలు, రోడ్డు పక్కల, మైదాన ప్రాంతంలోను, పార్కుల్లోను మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. ఎస్‌ఐ బి.జోగారావు, పంచాయతీ కార్యదర్శులు వై.సత్యనారాయణ, బి.ఎ.బి.ఎల్ మూర్తి పాల్గొన్నారు.

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో పద్యాలు, నీతి కథలు చెప్పడంపై సాధన చేయించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని సూచించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయుడు సంగీత్‌రాజ్ వ్యవహరించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అలేఖ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పీహెచ్‌సీ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో...

యలమంచిలి : మొక్కలను పరిరక్షిద్దాం జీవకోటిని కాపాడుకుందాం అనే నినాదంతో యలమంచిలి అటవీశాఖ ఆధ్వర్యంలో యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామంలో ప్రజలు ప్రజాప్రతినిధులతో కలసి మొక్కలు నాటారు. గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. అడవులు అంతరించిపోవడం వలన ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని వర్షపాతం తగ్గిపోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వమ్మవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, అటవీశాఖ సిబ్బంది విజయ కుమార్, కృష్ణ, రమణ, లైనుకొత్తూరు సర్పంచ్ కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.



నక్కపల్లి కేజీబీవీ వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ రత్నం, వీసం రామకృష్ణ



పర్యావరణం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు సంగీత్‌రాజ్



లైనుకొత్తూరులో మొక్కలను నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

చెరువుల సుందరీకరణ పనుల పరిశీలన

నక్కపల్లి : మండలంలో అమృత సరోవర్ పథకం కింద చేపడుతున్న చెరువుల బ్యూటిఫికేషన్ పనులను మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి సోమవారం పరిశీలించారు. కాగిత, ఉపమాక, దోసలపాడు చందనాడ తదితర గ్రామాల్లో ఆమె ఎంపీడీవో సీతారామరాజుతో కలసి పర్యటించారు. చెరువుల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. చెరువులను పార్కుల మాదిరిగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గట్లు పటిష్ట పరిచి వాకింగ్ ట్రాక్‌లు, కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రతి పంచాయతీలోను ఒక చెరువును ఈ పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ ఏపీవో ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెరువు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మునగపాకలో ఆయన సోమవారం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు మొక్కలు నాటారు. నాగవరంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి మొక్కలు నాటారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయ కన్వీనర్ దాసరి అప్పారావు, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు,ఏపీవో ఎరకయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సర్పంచ్ అప్పారావు

అతిసార నియంత్రణకు జాగ్రత్తలు అవసరం

పాయకరావుపేట : ఈ నెల 5 నుండి 17 వ తేదీ వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో అతిసార నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలలో భాగంగా జింక్ , ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఏవిధంగా తీసుకోవాలో ప్రజలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ పద్మప్రియ, ఎంపీహెచ్‌ఈఓ రమణ, ఎంపీహెచ్‌ఈఓ గణేష్, ఎంపీహెచ్‌ఎస్ నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : చిన్న పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్‌అజీద్ అన్నారు. పి.ధర్మవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు వేసవి రోజుల్లో ఈ వ్యాధి బారిన పడుతుంటారని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార లక్షణాలు కనిపిస్తే అవసరమైన వైద్యసేవలు చేయించాలని చెప్పారు.

తిమ్మరాజుపేటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

మునగపాక: తిమ్మరాజుపేటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సోమవారం తిమ్మరాజుపేట సచివాలయంలో గ్రామాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిమ్మరాజుపేటకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాశంకర్,గణేష్,కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే కఠిన చర్యలు



బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక సహాయక అధికారి నరేష్

ఎస్.రాయవరం : బాలల హక్కులను హరిస్తూ పనులు, యాచక విధానం అలవాటు చేస్తే కారకులైన తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కార్మిక సహాయక అధికారి వి.నరేష్ అన్నారు. అడ్డురోడ్డు పరిసర ప్రాంతాల్లో సోమవారం పలువురు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. యాచకం చేయిస్తున్న బాలలను గుర్తించి అవగాహన కల్పించారు.

మట్టి తవ్వకాలపై సమాచారం ఇవ్వండి

ఎస్.రాయవరం : చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే సహించేది లేదని యలమంచిలి డీఈ సుజాత అన్నారు. మండలంలో పలుగ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా కొన్ని చెరువుల్లో మట్టి తరలించినట్టు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రుళ్లు మట్టి తీస్తే తమకు, పోలీస్‌శాఖకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ వెంట ఏఈ చిన్నారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు పేర్కొన్నారు. మునగపాకలో ఎర్ర వెంకయ్య వీధిలో సోమవారం ఆయన ప్రజాసంఘాల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు, కార్మిక సంఘాలకు సంబంధించిన ప్రతి ఒక్కరికీ తమ సమస్యల పరిష్కారానికి ఇటువంటి కార్యాలయం వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలకృష్ణ, వి.వి. శ్రీనివాసరావు,ఆళ్ల మహేశ్వరరావు,బ్రహ్మాజీ,రాము,జగ్గారావు,అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

మునగపాక : విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కిలాడ దుర్గా ప్రసాద్ కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం మునగపాక శాఖా గ్రంథాలయంలో వివిధ దురాచారాలను రూపుమాపిన ఉద్యమాలపై పాటల రూపంలో ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివకోటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే మీ ఇంటికొచ్చా..

కోటవురట్ల : మీ సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ఇంటికొచ్చా..సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోంది..రాజకీయం చేయకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం..ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారా లేదా..మీ మనసును అడగండి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందో అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రభుత్వ పాలనను వివరించారు. పాములవాక సచివాలయ పరిధిలో కన్నూరుపాలెం, భీమిరెడ్డిపాలెం, సుర్లవానిపాలెం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఓ పక్క జోరు వాన కురుస్తున్నా వెనక్కి తగ్గకుండా గొడుగు వేసుకుని ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఏదైనా పని కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, ఇపుడా పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. మళ్లీ చంద్రబాబు మోసపు మాటలు విన్నారంటే నిలువునా ముంచేస్తాడని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో మీ మనసును అడిగి ఓటు వేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ, మతం, కులం చూడకుండా అర్హతే కొలమానంగా పథకాలను అందిస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేలా ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా అమ్మ ఒడి పథకం ద్వారా చదువుకు ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. రైతులకు, మహిళల ఆర్థిక పరిపుష్టికి, చిరు వ్యాపారులకు, కుల వృత్తుల వారికి ఆసరా నిలిచారన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. గుడి నిర్మించుకునేందుకు ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. ఇలా ఊరికి, కుటుంబాలకు కూడా జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తున్నారని, ఆయనను మళ్లీ అత్యధిక సీట్లతో గెలిపించి సీఎంగా చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు సత్యవతి, కోసూరు అప్పారావు, కె.వరహాలబాబు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కన్నూరుపాలెంలో వర్షంలోనే గడప గడపను సందర్శిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ధనిశెట్టి కృష్ణ అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ నాయకులు, పట్టణ మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి కృష్ణ అంత్యక్రియలకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరయ్యారు. అనారోగ్యంతో కృష్ణ ఆదివారం విశాఖపట్నంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం పట్టణంలో గల కృష్ణ స్వగృహానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరై కృష్ణ భౌతిక కాయం వద్ద నివాళిలర్పించారు. కృష్ణ సోదరులైన పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ధనిశెట్టి తిరుమల్లేశ్వరరావులను ఓదార్చారు. కృష్ణ భార్య, పిల్లలకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియలకు తీసుకెళ్తున్న కృష్ణ పాడెను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కొంతదూరం మోశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గారా ఉష శ్రీ ప్రసాద్, జగతా భవానీ శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలు, కాంగ్రెసు పార్టీ అధికార ప్రతినిధి జగతా శ్రీను తదితరులు కృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించారు.



ధనిశెట్టి కృష్ణ పాడెను మోస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఇంటింటికీ తాగునీటి సదుపాయం

కోటవురట్ల : ఇక ఏ గ్రామంలో కూడా మంచినీటి సమస్య ఉండదు.. నేరుగా మీ ఇంటికే మంచినీళ్లు వస్తున్నాయి..దాహం కేకలు ఎక్కడా వినిపించవని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కన్నూరుపాలెం, భీమిరెడ్డిపాలెం గ్రామాలలో శనివారం జల్ జీవన్‌మిషన్ పథకాన్ని ప్రారంభించారు. రూ.12 లక్షలతో పథకం ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో కూడా మంచినీటి సమస్య ఉండకూడదనే జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీటి సదుపాయం కలుగుతుందన్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో తాగునీటి పనులు పూర్తి కాగా, మిగిలిన గ్రామాల్లో త్వరలోనే పూర్తి కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు సత్యవతి, కోసూరు అప్పారావు, కె.వరహాలబాబు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



భీమిరెడ్డిపాలెంలో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డులివ్వాలి

మునగపాక: గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. కౌలురైతుల రక్షణయాత్రను ఆయన సోమవారం మునగపాక నుంచి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సాయం అందడం లేదన్నారు. పంటల బీమా, రైతు భరోసా తదితర సేవలకు నోచుకోలేకపోతున్నారన్నారు. కౌలురైతులకు సీసీఆర్ కార్డులు అందించాలన్నారు. ఈ కార్డులు ఉన్నవారికి బ్యాంకుల నుంచి రూ.లక్ష వరకు రుణసాయం అందుతుందన్నారు. భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామన్న నిబంధన తొలగించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రైతు భరోసాను రూ.25వేలకు పెంచాలని, కేరళ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. సన్న,చిన్న కారు రైతుల రుణాలు రద్దు చేయాలన్నారు. పలు జిల్లాల మీదుగా ఈ యాత్ర ఈ నెల 12వ తేదీనాటికి మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయం వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ అధ్యక్షులు కర్రి అప్పారావు,సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు,, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు,సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ,పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కౌలురైతుల రక్షణయాత్రను ప్రారంభిస్తున్న కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

జెట్టీ నిర్మాణం కోసం స్థల పరిశీలన

నక్కపల్లి : రాజయ్యపేటలో జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం సోమవారం పరిశీలించారు. మండలంలో మత్స్యకారుల కోసం ప్రభుత్వం ఫిష్‌ల్యాండింగ్ సెంటరు (జెట్టీ) మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ జెట్టీ నిర్మించేందుకు 10 ఎకరాల స్థలం అవసరం కానుంది. రాజయ్యపేట శివారు బోయపాడు, దొండవాక గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. రాజయ్యపేట పరిధిలో తీరంలో ఉన్న స్థలాన్ని ఆర్‌డీవో మత్స్యశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఇది అటవీశాఖకు చెందిన భూమి అని, ఈ భూమిని సేకరించి ప్రత్యామ్నాయంగా వేరొక చోట అటవీశాఖకు భూమిని బదలాయించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు ఆర్‌డీవో తెలిపారు. ఈయన వెంట మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, డిప్యూటీ తహసీల్దార్ నీరజ, సర్పంచ్ కామేసు, ఎంపీటీసీ సత్తియ్య, స్థానిక మత్స్యకారులు ఉన్నారు.



రాజయ్యపేట తీరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో జయరాం